రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే రాష్ట్ర ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు.

సిరిసంపదలతో తులతూగాలి: ఎంపీ వద్దిరాజు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబురాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

మూడు రోజుల్లో ఏపీ వైపు 1.78లక్షల వాహనాలు

- హైదరాబాద్ -విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణ వాసులందరూ పల్లెబా ట పట్టారు. దీంతో హైదరాబాద్ నుం చి విజయవాడ, కర్నూలు, తమిళనా డు వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతున్నది. చౌటుప్పల్, తుప్రాన్‌పేట, ఆందోల్ మైసమ్మ, పంతంగి టోల్ ప్లాజా తదిత ర ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు. మూడు రో జుల్లో 11టోల్ గేట్ల ద్వారా ఏపీ వైపు సుమారు 1,78,000 వాహనాలు వెళ్లాయి.

అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

మొదటిపేజీ తరువాయి...

యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాల కాలంగా పాడి ఉత్పత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్నది. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 24 చిల్లింగ్ సెంటర్లు, 32 వేల మంది సభ్యులు, 432 సొసైటీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. 3లక్షల మంది వినియోగదారులకు పాలు, పాల ఆధారిత ఉత్పత్తులను అందిస్తున్నది.

రూ.60కోట్ల అప్పులు అంటూ..

మదర్ డెయిరీ 26వ సర్వసభ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ఈ నెల 9న సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 2న హయత్ నగర్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 'నార్మాక్ యూనియన్ రూ.60కోట్ల వరకు ఆర్థిక భారం ఏర్పడి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు యూనియన్ స్థిరాస్తులు విక్రయించడానికి చర్చించి నిర్ణయం తీసుకుకోవడానికి..' అని ఎజెండాలో స్పష్టం చేశారు.

ఉమ్మడి నల్లగొండలో 30.5 ఎకరాల అమ్మకం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూనియన్ పేరు మీద కొనుగోలు చేసిన భూములను అమ్మాలని స్కెచ్ వేశారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల పరిధిలో 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 1.5 ఎకరాల భూమిని విక్రయించాలని ఎజెండాలో పేర్కొన్నారు.

గతంలో ఒప్పుకోని బీఆర్ఎస్ సర్కారు

పాడి రైతులకు వరంగా ఉన్న డెయిరీ ఆస్తులను అమ్మేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అంది. గతేడాది సెప్టెంబర్‌లో మదర్ డెయిరీ ఎన్నికల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు క్యాంపులకు విజయ డెయిరీ మాదిరిగానే మదర్ డెయిరీకి గ్రాంట్లు ఇప్పించి, అప్పులు తీర్చేలా ఆదుకుంటామని ప్రకటించారని సభ్యులు చెబుతున్నారు. లీటరుకు రూ.4 బోనస్ ఇస్తామని చెప్పి పాల రేట్లను తగ్గిస్తూ వచ్చారని వాపోతున్నారు.

ఆస్తులు విక్రయిస్తే ఉద్యమమే..

మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందా? ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చెప్పిన గ్రాంట్లు ఏమయ్యాయి..? లీటరుపై నాలుగు రూపాయల బోనస్ ఇవ్వకపోగా రేట్లు తగ్గించడం దారుణం. ఆస్తుల విక్రయం నిర్ణయాన్ని విరమించుకోవాలి. పట్టించుకోకుండా ముందుకు వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం.

- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్

రిటైర్మెంట్ సడలింపుపై వీసీల గుర్రు

- రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా!
- 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ బోధకుల కొనసాగింపు
- రెగ్యులర్ ప్రొఫెసర్లకూ అరవై ఏండ్లకే పదవీ విరమణ
- ఉన్నత విద్యామండలి తీరును వ్యతిరేకిస్తున్న వీసీలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిబంధనలంటే అందరికీ సమానం. ఇక రిటైర్మెంట్ విషయంలో ఎవరికీ మినహాయింపేం కాదు. కానీ ఉన్నత విద్యామండలి మాత్రం ఈ విషయాన్ని విస్మరించి నడుచుకుంటున్నది. రెగ్యులర్ వారికి ఒకలా.. కాంట్రాక్ట్ వారికి మరోలా నిబంధనలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఒకవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లు 60 ఏండ్లకే పదవీ విరమణ పొందుతుండగా, 60 ఏండ్లు దాటిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించవచ్చని ఆదేశాలిచ్చింది. వర్సిటీలకు మండలి లేఖలు రాసింది. ఇది వివాదాస్పదమైంది. ఈ లేఖపై ఉన్నత విద్యామండలి వర్సెస్ వర్సిటీలు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇటీవల ఉన్నత మండలి అన్ని వర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో లేఖ ప్రస్తావన రాగా, ఓయూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదేం విధానమని, ఎలా కుదురుతుందని మండలి అధికారులను నిలదీసినట్టు తెలిసింది. అటానమస్ హోదా గల వర్సిటీల విషయంలో మండలి జోక్యం తగదని కొందరు వీసీలు అన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. మండలి కేవలం సూచనలు, సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్టుగా అధికారుల్లో చర్చలు నడుస్తున్నాయి.

అవసరముంటేనే తీసుకోవాలని సూచించాం

వర్సిటీల్లో అవసరముంటే 60 ఏండ్లు దాటిన వారిని తీసుకోవాలని సూచన మాత్రమే చేశాం. అవసరాన్ని బట్టి పరిశీలించమన్నాం. అదేం జీవో కాదు. కేవలం సర్క్యులర్ మాత్రమే. అయినా కొనసాగించాలా.. లేదా అన్నది వీసీల ఇష్టం. తప్పనిసరిగా అమలుచేయాలన్న నింబంధనలేం లేవు.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

'సంక్రాంతి' లింక్ క్లిక్‌చేస్తే లూటీ

- ప్రమాదకర మాల్‌వేర్‌తో సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ
- జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఎంజాయ్ సంక్రాంతి స్పెషల్ ఫ్రీ రీచార్జ్.. 4 జీబీ డాటా వ్యాలిడ్ టిల్ యువర్ కరెంట్ ప్యాక్ వ్యాలిడిటీ. ఆల్సో గెట్ 2 జీబీ డాటా అన్ యువర్ నెట్స్ రీచార్జ్' అంటూ ఓ సైబర్ మోసగాడి నుంచి ఫేక్ మెసేజ్. 'సంక్రాంతి పండుగ సందర్భంగా మీ నంబర్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. మీకు 10 జీబీ డాటా ఉచితంగా అందించబడుతుంది. దీని కోసం మేము పంపిన లింక్‌ను క్లిక్ చేసి, మీ వివరాలు పొందుపర్చండి. ఆ తర్వాత ఆ మెసేజ్‌ను 10 మందికి పంపితే మీకు పూర్తి ఉచితంగా 10 జీబీ డాటా లభిస్తుంది' అంటూ మరో కేటుగాడి మెసేజ్. ఇలా.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో ప్రకటనలు, మెసేజ్‌లతో అమాయకులకు వల వేసి డబ్బులు లూటీ చేస్తున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో అప్రమత్తమైంది.ఇలాంటి ప్రకటనలకు ఎవరూ ఆశపడొద్దని, లింకులను క్లిక్ చెయ్యొద్దని సూచిస్తున్నది.

నా కుమారుడికి గుర్తింపు ఇవ్వలేదు

ఓపెన్ ఏఐపై సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ • మరణంపై ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 12: చాట్‌జీపీటీ అభివృద్ధిలో తన కుమారుడు ఎంతో కృషి చేసినప్పటికీ ఓపెన్‌ఏఐ సంస్థ మాత్రం తగిన గుర్తింపు ఇవ్వలేదని సుచిర్ బాలాజీ తల్లి అపర్ణారావు ఆరోపించారు. చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐలో సుచిర్ బాలాజీ నాలుగేండ్లు పని చేసి 2023 ఆగస్టులో రాజీనామా చేశారు. ఆ తర్వాత ఓపెన్‌ఏఐ అనైతిక చర్యలకు పాల్పడుతున్నదని ఆయన ఆరోపించి, పలు ఆధారాలను బయటపెట్టారు. ఈ క్రమంలో గత నవంబర్‌లో శాన్ ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ విషయమై ఆయన తల్లి అపర్ణారావు మారియా నాఫల్ అనే సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్‌తో మాట్లాడుతూ..'చాట్‌జీపీటీని వేగంగా, సమర్థంగా అభివృద్ధి చేయడానికి నా కొడుకు తోడ్పడ్డాడు. కానీ తను మరణించే వరకు తన పనికి గుర్తింపు దక్కలేదనే బాధ అతడిలో ఉండేది. ఇప్పుడు కూడా సుచిర్ సేవలకు ఓపెన్‌ఏఐ తగిన గుర్తింపు ఇవ్వకపోవడం దురదృష్టకరం' అని ఆమె పేర్కొన్నారు. తమ కుమారుడి మరణం ఆత్మహత్యలా లేదని, అసలు నిజాన్ని తేల్చడానికి ఎఫ్‌బీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

- హైవేపై కిక్కిరిసిన వాహనాలు

హైదరాబాద్ – విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా 16 టోల్‌బూత్‌లు ఉండగా.. విజయవాడ వైపు 11 బూత్‌లను తెరిచారు. గత సంక్రాతికి 77వేల వాహనాల రికార్డు ఉండగా.. ఇప్పుడు 6వేలు అధికంగా వెళ్లడంతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది.
– చౌటుప్పల్

సంక్రాంతి స్పెషల్ బాదుడు

- ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్న ఆర్టీసీ
- జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.240, నిర్మల్‌కు 650

మెదక్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులపైన స్పెషల్ పేరిట ఆర్థిక భారం మోపుతున్నది రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (టీజీఎస్ఆర్‌టీసీ). పండుగకోసం స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నది. స్పెషల్ బస్సుల పేరిట బోర్డులు తగిలించి ముక్కుపిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అవసరమైన మేరకు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక చార్జీలు పెట్టి కూడా దూర ప్రాంతాలకు నిలబడి పోవాల్సి వస్తున్నదని పురుష ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిర్మల్, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా బాన్సువాడ, బోధన్, ఎల్లారెడ్డి నుంచి నడిపిస్తున్న కొన్ని బస్సులకు దూర ప్రాంతాల బోర్డులు వేసి స్పెషల్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచే తమకు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణకు దిగారు. మెదక్ డిపో నుంచి సంక్రాంతి స్పెషల్‌గా ఎక్స్‌ప్రెస్ బోర్డుతో వచ్చిన టీఎస్ 35 జడ్ 0022 బస్సు ఉదయం 7:30 గంటలకు జేబీఎస్‌కు చేరుకుంది. జేబీఎస్‌లో ఆ బస్సు ఎక్కిన ప్రయాణికులతో డ్రైవర్ టికెట్ ఇచ్చి అధికంగా వసూలు చేశాడు. జేబీఎస్ నుంచి మెదక్‌కు రూ.160 చార్జి కాగా, అదనంగా రూ.80 వసూలు చేసి రూ.240 టికెట్ ఇచ్చాడు. అక్కడే ఉన్న మెదక్ డిపో మేనేజర్‌ను ఇదేమిటని అడుగగా, సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 650 వసూలు చేశారు.

ఆదివారం జేబీఎస్ నుంచి మెదక్‌కు ఇద్దరికి ఇచ్చిన టికెట్ ధర

బడ్జెట్‌పై సర్కారు కసరత్తు

- సంక్రాంతి తర్వాత శాఖలవారీ సమావేశాలు
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశాలు
- 2024-25లో ప్రభుత్వ అప్పులు 70,909 కోట్లు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 2025-26 బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. సంక్రాంతి డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క శాఖలవారీ సమావేశాలు ఏర్పాటు చేస్తారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ అంచనాలు సిద్ధం చేయాలని నిర్ణయించినట్టు అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి మొదటివారంలో కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు మార్చి, ఫిబ్రవరి మూడో వారంలో శాసన సభలో ప్రవేశపెట్టే అవకాశముంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మార్కెట్ నుంచి రూ.40,909 కోట్లు రుణాలు సేకరించింది. చివరి త్రైమాసికంలో మరో రూ.30,000 కోట్లను సమీకరించేందుకు ఆర్బీఐకి ప్రతిపాదనలు సమర్పించింది. ఒక్క ఏడాదిలోనే మార్కెట్ రుణాలు మొత్తం రూ.70,909 కోట్లకు చేరుకున్నాయి. అదనంగా రూ.30,000 కోట్లను ఆఫ్-బడ్జెట్ రుణాలు, ప్రీమియం స్థలాలను తాకట్టు పెట్టడం ద్వారా సమీకరిస్తున్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

అవినీతిని ప్రశ్నిస్తేనే మంచి సమాజం

- యువతకు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఉద్బోధ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): యువత చట్టాలపై అవగాహన పెంచుకొని అవినీతిని ప్రశ్నిస్తేనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఉద్బోధించారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను గమనిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఏసీ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, కోర్ కమిటీ సభ్యులు కోమటి రమేశ్‌బాబు, డీ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని ఏపీకి పంపండి

- 400 మంది హోంగార్డుల వేడుకోలు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'మా బిడ్డల చదువులు, వృద్ధులైన తల్లిదండ్రులు, స్థానికత వంటి సమస్యలతో నిత్యం సతమతమవుతున్నాం.. తక్షణం తమను ఆంధ్రప్రదేశ్‌కు పంపాలి' అని ఏపీకి చెందిన 400 మంది హోంగార్డులు కోరుతున్నారు. ఆదివారం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు బహిరంగ లేఖ రాశారు. ఇదే స్థానికత అంశానికి సంబంధించి ఏపీ నుంచి తెలంగాణకు రావడానికి కూడా 400 మంది హోంగార్డులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ కుటుంబం ఏపీలో ఉంటే.. ఉద్యోగం తెలంగాణలో ఉందని, దీంతో 11 ఏండ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో తమను నాన్-లోకల్‌గా చూస్తున్నారని, అలాగే తెలంగాణవారిని ఏపీలో నాన్‌లోకల్‌గా పరిగణిస్తున్నారని, ఈ సమస్యకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలు త్వరగా పరిష్కారం చూపాలని కోరారు.

కాళోజీ పురస్కారం ఇక లేనట్టేనా?

- 2024 అవార్డుకు నలిమెల భాస్కర్ ఎంపిక
- ఆయన జయంతిరోజు ప్రదానం చేయని సర్కారు
- ఈ ఏడాది ఎంపికపైనా సాహితీప్రియుల్లో డౌట్
- 2015 నుంచి 2023 దాకా ఇచ్చిన బీఆర్ఎస్ సర్కార్

హైదరాబాద్, జనవరి 12(నమస్తే తెలంగాణ): జీవితాంతం తెలంగాణ కోసం పరితపించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావును ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తున్నది. కాళోజీ మరణానంతరం ఆయన పేరిట ఏటా ఆయన జయంతిరోజున బీఆర్ఎస్ ఇస్తూ వచ్చిన కాళోజీ పురస్కారాన్ని ఈ ప్రభుత్వం విస్మరిస్తున్నది. ఈ పురస్కారానికి 2024లో ఎంపిక జరిగినా అవార్డు ఇవ్వకుండా సాహితీలోకాన్ని చిన్నచూపు చూస్తున్నది. దీంతో సాహితీప్రియులు ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఏటా కాళోజీ జయంతి అయిన సెప్టెంబర్ 9న అవార్డు ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. గత ఏడాది కూడా అవార్డు కోసం ప్రభుత్వం ప్రముఖ సాహితీవేత్త నలిమెల భాస్కర్ పేరును ప్రకటించింది. అయినా కాళోజీ జయంతి రోజున అవార్డును మాత్రం ప్రదానం చేయలేదు. కాళోజీ తెలంగాణ భాషకు, సంస్కృతికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి రోజును 'తెలంగాణ భాషా దినోత్సవం'గా జరుపుకోవాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2015 నుంచి ఏటా ప్రముఖ సాహితీవేత్తను ఒకరిని ఎంపికచేసి వారికి కాళోజీ పురస్కారాన్ని ఇవ్వడం ప్రారంభించింది. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న ఈ అవార్డును ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నది. అవార్డు కింద రూ.జ్ఞాపికతోపాటు రూ.1,01,116 నగదు బహుమతిని అందిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో 2023 వరకు తెలంగాణలో ఉత్తమ సాహితీవేత్తలను ఈ అవార్డుతో సత్కరిస్తూ గౌరవిస్తూ వచ్చింది.

అందెశ్రీ నేతృత్వంలో ఎంపిక కమిటీ

2024 సంవత్సరానికిగాను కాళోజీ అవార్డు ఎంపిక కోసం ప్రభుత్వం ప్రముఖ కవి అందెశ్రీ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రముఖ సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు, కవి, రచయిత, అనువాదకుడు నలిమెల భాస్కర్‌ను అవార్డుకు ఎంపికచేసింది. సెప్టెంబర్ 7న భాస్కర్ పేరును ప్రభుత్వం ప్రకటించినప్పటికీ 9న కాళోజీ జయంతి రోజున అవార్డు ఇవ్వకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కాళోజీ అవార్డుపై ప్రభుత్వ వైఖరి ఏమిటనేది అంతు బట్టడంలేదు. భవిష్యత్తులో ఈ అవార్డు ఉంటుందా? ఉండదా? ఈ ఏడాదైనా ప్రకటిస్తారా? లేక ఈ ఏడాది అవార్డుతోపాటు నిరుడు ఎంపికచేసిన వారికి కూడా ఇస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉన్నది. దీనిపై భాషా, సాంస్కృతిక శాఖ అధికారులు మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు.

బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన నలిమెల భాస్కర్‌కు 14 భాషల్లో పట్టు ఉన్నది. తెలుగు అధ్యాపకుడిగా పనిచేసి 2011లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అద్దంలో గాంధారి, మట్టి ముత్యాలు, సుద్ద ముక్క వంటి సంకలనాలను ఆయన ఆవిష్కరించారు. వివిధ భారతీయ భాషల కథలను తెలుగులోకి అనువదించడంతోపాటు తెలంగాణ పదకోశాన్ని రూపొందించారు. మలయాళ నవల స్మారక శిశిగల్‌ను తెలుగులోకి స్మారక శిలలు పేరిట అనువదించారు. ఈ పుస్తకానికి 2013లో అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

బీఆర్ఎస్ హయాంలో కాళోజీ పురస్కారం పొందిన సాహితీవేత్తలు

సంవత్సరం	అవార్డు గ్రహీత
2015	అమ్మంగి వేణుగోపాల్
2016	గోరెటి వెంకన్న
2017	రావులపాటి సీతారాం
2018	అంపశయ్య నవీన్
2019	కోట్ల వెంకటేశ్వరరెడ్డి
2020	రమా చంద్రమౌళి
2021	పెన్నా శివరామకృష్ణ
2022	రామోజు హరగోపాల్
2023	జయరాజ్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

పీఆర్టీయూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తేతెలంగాణ): తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పీఆర్టీయూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీజీఏ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్) సమావేశానికి ఆయన హాజరయ్యారు.

టీటీడీ పరకామణిలో బంగారం చోరీ

- విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడ్డ బ్యాంకు ఉద్యోగి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఓ ఉద్యోగి బంగారాన్ని దొంగిలిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డాడు. టీటీడీ పరిధిలో వివిధ చోట్ల నెలకొల్పిన హుండీలను ఒకేసారి పరకామణికి తరలిస్తారు. ఇదే సమయంలో బ్యాంకు ఉద్యోగి పెంచలయ్య వంద గ్రాముల బంగారం బిస్కెట్‌ను ఎత్తుకెళ్తుండగా విజిలెన్స్ సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు. వ్యర్థాలను బయటికి తీసుకెళ్లే ట్రాలీలో బంగారం బిస్కెట్‌ను తరలిస్తుండగా పట్టుకొని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. చోరీ ఘటనపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్పందించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

కొనసాగుతున్న వైకుంఠ ద్వార దర్శనాలు

- బాధితులకు పరిహారం అందజేసిన టీటీడీ చైర్మన్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్లు పొందిన భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారు. రెండురోజులపాటు నిర్వహించిన ఏకాదశి ద్వాదశి దర్శనాలు ముగియగా ఎనిమిది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం శ్రీవారిని 53,013 మంది భక్తులు దర్శించుకున్నారు. కాగా, తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డ ఏడుగురు బాధితులకు స్విమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిహారాన్ని అందజేశారు.

విద్యుత్తు ఇంజినీర్లకు పదోన్నతులివ్వండి

ఉపముఖ్యమంత్రి భట్టిని కోరిన టీఈఈఏ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న ఇంజినీర్లకు పదోన్నతులివ్వాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) ప్రభుత్వాన్ని కోరింది. కొందరికి పదోన్నతులిచ్చినా.. ఇంత వరకు పోస్టింగ్స్ ఇవ్వలేదని, వారికి తక్షణమే పోస్టింగ్స్ ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేసింది. టీఈఈఏ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఈఈఏ నేతలు మాట్లాడుతూ.. గతంలో పదోన్నతులు పొంది ఏపీ ఉద్యోగుల రాకతో రివర్షన్ అయిన ఇంజినీర్లకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. త్వరలోనే సమావేశమై అన్ని సమస్యలను పరిష్కరించుకుందామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు. టీఈఈఏ అధ్యక్షుడు ఎన్ శివాజీ, ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్యశెట్టి, తదితరులున్నారు.

అగ్రికల్చర్ వర్సిటీలో చిరుత!

- జయశంకర్ విగ్రహం వద్ద వాకర్స్‌కు కనిపించిన పులి

హైదరాబాద్, జనవరి 12(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రాజేంద్రనగర్ పరిధిలో మరోసారి చిరుత సంచారం కలకలం సృష్టించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్నింగ్ వాకర్స్‌కు చిరుత కనిపించింది. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్దకు వచ్చిన చిరుత.. అక్కడి నుంచి పొదల్లోకి వెళ్లిపోయినట్టు తెలిపారు. చిరుత సంచారంతో విద్యార్థులు, మార్నింగ్ వాకర్స్ భయాందోళన చెందుతున్నారు.